అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

టేక్మాల్, అక్టోబర్ 2: అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి చెందిన ఘటన టేక్మాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎక్లాస్‌పూర్ గ్రామ శివారులో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. టేక్మాల్ గ్రామానికి చెందిన బాజ మోహన్ (26) వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. మంగళవారం పోలానికి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. సాయంత్రమైనా ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. ఎక్లాస్‌పూర్ నుంచి రంగన్నపల్లె వైపు వెళ్లే రోడ్డుపై బైక్ ఉందని, ఎక్లాస్‌పూర్ వ్యక్తి ఫోన్ ద్వారా బుధవారం సమాచారం ఇచ్చారు. దీంతో కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి వెళ్లగా రోడ్డుపై బైక్ నిలిపి ఉంది. అక్కడ పరిసరాలను పరిశీలించగా రోడ్డు పక్కన ఉన్న గోతిలో పడి చనిపోయి ఉన్నట్లు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. మోహన్ మృతిపై అనుమానాలు ఉన్నట్లు అతని భార్య సునీత ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఏఎస్సై దయానంద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అపహరణకు గురైన విగ్రహం లభ్యం

టేక్మాల్, అక్టోబర్ 2: అపహరణకు గురైన విగ్రహం లభ్యమైంది. మండలంలోని వేల్పుగొండ గ్రామ శివారు చెరువు మధ్యలో ఉన్న గుట్టపై పార్శ్వనాథుడు తీర్థంకర ఏకశిలా విగ్రహం ఉంది. వేల్పుగొండ, సూరంపల్లి వారు మేకలే మేత కోసం గుట్టపైకి తీసుకెళ్లేవారు. ఈ క్రమంలో ఆగస్టు 30న మేకలను మేతకు తీసుకెళ్లారు. గుట్టపై కొలువుదీరిన తీర్థంకర విగ్రహం కనిపించలేదు. దీంతో పశువుల కాపరులు గ్రామస్తులకు సమాచారం అందించారు. దీంతో ప్రజలు గుట్ట వద్దకు వచ్చి పరిసరాలను పరిశీలించగా విగ్రహం కనిపించలేదు. దీంతో టేక్మాల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులకు నల్గొండ జిల్లా సమీపంలో విగ్రహం లభ్యమైంది. వాహనంలో విగ్రహాన్ని తీసుకొచ్చారు. పోలీసుల విచారణ కొనసాగుతున్నది.

ఏటీఎం వద్ద మోసాలకు పాల్పడుతున్న వ్యక్తికి రిమాండ్

మెదక్ అర్బన్, అక్టోబర్ 2: ఎస్బీఐ ఏటీఎం వద్ద డిపాజిట్ చేయడానికి వచ్చినవారిని మోసం చేస్తున్న వ్యక్తిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. గత నెల 14న ఏటీఎంలో రూ.5 వేలు డిపాజిట్ చేయడానికి వచ్చిన వ్యక్తిని అల్లాదుర్గం మండలం ముస్లాపూర్ గ్రామానికి చెందిన బేగరి అరవింద్ తనకు నగదు అవసరమని, మీకు ఫోన్ పే చేస్తానని చెప్పి డబ్బులు తీసుకుని మోసంచేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని బుధవారం రిమాండ్‌కు తరలించారు. ఇతడిపై మరో నాలు గు పోలీస్‌స్టేషన్లలో కేసులున్నట్లు ఎస్సై తెలిపారు.

వేంకటేశ్వర ఆలయంలో చోరీ

అల్లాదుర్గం, అక్టోబర్ 2: వేంకటేశ్వర ఆలయంలో చోరీ ఘటన అల్లాదుర్గంలో మంగళవారం రాత్రి జరిగింది. హుండీని పగలగొట్టి సుమారు రూ.30 వేల వరకు నగదు ఎత్తుకుపోయినట్లు పూజారి ప్రవీణ్‌శర్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రవీణ్‌రెడ్డి తెలిపారు. దొంగను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు ర్యాలీగా 161 జాతీయ రహదారి సర్వీస్ రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు.

పరిస్థితి విషమించి యువకుడి మృతి

నిజాంపేట,అక్టోబర్ 2: జీవితంపై విరక్తి చెంది పురుగు మందు తాగి గాంధీ దవాఖానలో చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన ఘటన నిజాంపేటలో బుధవారం జరిగింది. పోలీసుల కథన ప్రకారం.. గ్రామానికి చెందిన దండు నరేశ్ (42) బతుకుదెరువు కోసం దుబాయ్ వెళ్లి అక్కడ ఆరోగ్యం బాగాలేక ఇంటికి తిరిగి వచ్చాడు. నిజాంపేటలో సరిగ్గా పని దొరకకా ఆర్థికంగా ఇబ్బందులతో అప్పులు చేశాడు. వాటిని తీర్చలేక మంగళవారం పరుగు మందు తాగాడు. మనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం గాంధీ దవాఖానకు తరలించారు. అక్కడ పరిస్థితి విషమించి బుధవారం మృతి చెందాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

శివ్వంపేట, అక్టోబర్ 2: దంతాన్‌పల్లి గ్రామంలో ఆత్మహత్య చేసుకుని మృతిచెందిన కుల్ల అంజలి కుటుంబానికి పలువురు నాయకులు బుధవారం పరామర్శించారు. మాజీ జడ్పీటీసీ పబ్బ మహేశ్‌గుప్తా రూ.5వేలు, పీఏసీఎస్ చైర్మన్ వెంకట రామిరెడ్డి రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. వారి వెంట మాజీ సర్పంచ్ కన్నారం దుర్గేశ్, మాజీ ఉపసర్పంచ్, రైతు సమన్వయ సమితి మాజీ మండలాధ్యక్షుడు మొలుగు నాగేశ్వర్‌రావు, నాగభూషణం, నర్సింలు యాదవ్ ఉన్నారు.

హనుమాన్ ఆలయ నిర్మాణానికి రూ.51 వేల విరాళం

చిలిపిచెడ్,అక్టోబర్ 2: మండలంలోని గౌతాపూర్ గ్రామంలో హనుమాన్ ఆలయం నిర్మాణంకు రూ.51వేల నగదును హైదరాబాద్ షాపూర్‌నగర్ పట్టణంకు చెందిన ముస్లీం యువకులు నగదును అందజేశారు.గ్రామంలో హిందూవు ఆలయంకు ముస్లీం యువకులు నగదును అందజేయడం చాలా సంతోషకారం అని గ్రామ నాయకులు అంజిరెడ్డి,విఠల్,గోవర్ధన్ రెడ్డి,ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

సుతారి సంఘం అధ్యక్షుడిగా మల్లేశం

మెదక్ మున్సిపాలిటీ, అక్టోబర్ 2: దున్గా భవానీ సుతారి సంఘం కార్యవర్గాన్ని బుధవారం జిల్లా కేంద్రంలోని సుతారి సంఘ భవనంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మార్గం మల్లేశం, ప్రధాన కార్యదర్శిగా కరుణాకర్, కోశాధికారిగా మార్గం సుధాకర్, ఉపాధ్యక్షుడిగా నర్సింలు ఎన్నికయ్యారు.

మంత్రాల నెపంతో వృద్ధురాలిపై దాడి

రామాయంపేట, అక్టోబర్ 2: మంత్రాల నెపంతో ఓ వృద్ధురాలిపై పదిమంది వ్యక్తులు దాడి చేసిన సంఘటన బుధవారం రాత్రి రామాయంపేట మండలం డి.ధర్మారం గ్రామంలో చోటుచేసుకుంది.రామాయంపేట పోలీసుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గుర్రం విజయ అనే వృద్ధురాలు ఇంట్లో పనులు చేస్తుండగా అదే గ్రామానికి చెందిన పది మంది వ్యక్తులు దాడిచేశారు. మంత్రాలు చేస్తున్నావు ఇంకా ఎంత మందిని అనారోగ్యానికి గురిచేస్తావంటూ ఒక్క సారిగా దాడి చేయడంతో ఆమె తీవ్రగాయాలకు గురైంది.దీంతో విషయం తెలుసుకున్న రామాయంపేట పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని గాయాలైన వృద్ధురాలిని రామాయంపేట ప్రభుత్వ దవాఖానకు తరలించి చికిత్స చేయిస్తున్నారు.దాడి చేసిన పదిమందిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శివ్వంపేట: గోమారంలో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

మెదక్ మున్సిపాలిటీ: బీఆర్ఎస్ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి

మెదక్ మున్సిపాలిటీ: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు

కలెక్టరేట్‌లో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, అధికారులు

గాంధీజీ అడుగు జాడల్లో నడవాలి

- దేశానికే ఆదర్శం మన జాతిపిత
- జాతిపిత కన్న కలలను నిజం చేయాలి
- జిల్లా వ్యాప్తంగా ఘనంగా గాంధీ జయంతి

అహింసా పద్ధతిలో స్వాతంత్ర్యం తీసుకొచ్చిన మహానుభావుడు, దేశం గర్వించదగ్గ వ్యక్తి జాతిపిత మహాత్మా గాంధీ అని పలువురు కొనియాడారు. బుధవారం గాంధీ 155 జయంతిని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, శివ్వంపేట మండలం గోమారంలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, మెదక్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో, హవేళీఘనపూర్‌లో ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు నివాళులర్పించారు. కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు,జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ ఉదయ్‌కుమార్ గాంధీ చిత్ర పటానికి నివాళులర్పించారు.

- న్యూస్ నెట్‌వర్క్, మెదక్, అక్టోబర్ 2

మెదక్ మున్సిపాలిటీ: ఎస్పీ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్

మెదక్ మండలం మక్తా భూపతిపూర్‌లో గాంధీ జయంతి నిర్వహిస్తున్న గ్రామస్తులు

నిజాంపేట: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన గాంధీ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నరేందర్, తదితరులు

చిలిపిచెడ్: ఫైజాబాద్‌లో నివాళులర్పింస్తున్న బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్

పెద్దశంకరంపేటలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్యులు

రామాయంపేట: గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

తూప్రాన్: గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఆర్డీవో జయచంద్రారెడ్డి

నేటి నుంచి దేవి శరన్నవరాత్రులు

పాపన్నపేట: ఏడుపాయల్లో శరన్నరాత్రి ఉత్సవాలకు ముస్తాబైన గోకుల్ షెడ్డు

మెదక్ మున్సిపాలిటీ: ఉత్సవాలకు ముస్తాబవుతున్న మెదక్‌లోని చమాన్ హనుమన్ దేవాలయం

చేగుంట మండల కేంద్రంలో ఉత్సవాలకు ముస్తాబైన దుర్గామాతా ఆలయం

జిల్లా వ్యాప్తంగా ముస్తాబైన మండపాలు

మెదక్ మున్సిపాలిటీ/వెల్దుర్తి/చిన్నశంకరంపేట, అక్టోబర్ 2: దేవి శరన్నవరాత్రోత్సవాలకు జిల్లా వ్యాప్తంగా పలు దేవాలయాల వద్ద మండపాలు ముస్తాబవుతున్నాయి. గురువారం నుంచి తొమ్మిది రోజుల వరకు జరిగే శరన్నవరాత్రోత్సవాలను ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లలో నిర్వాహకులు నిమగ్నమయ్యారు. దుర్గామాత 9 రోజుల పాటు వివిధ రూపాల్లో దర్శనమివ్వనున్నారు. మొదటి రోజు బాల త్రిపురా సుందరీ దేవి, రెండోరోజు గాయత్రీ దేవి, మూడో రోజు మహాలక్ష్మీదేవి, నాలుగో రోజు అన్నపూర్ణాదేవి, ఐదో రోజు లలితా త్రిపురా సుందరి, ఆరో రోజు దుర్గాదేవి, ఏడో రోజు సరస్వతీ దేవి, ఎనిమిదో రోజు మహిషాసురమర్థిని, తొమ్మిదో రోజు దుర్గామాతగా భక్తులకు దర్శనమిస్తారు.

ఉత్సవాలకు ఏడుపాయల ముస్తాబు.

పాపన్నపేట, అక్టోబర్2: ఏడుపాయల వనదుర్గాభవానీ మాత సన్నిధిలో నేటి నుంచి 12వ తేదీ వరకు శరన్నరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఏడుపాయల్లోని గోకుల్ షెడ్‌లో నిర్వహించే శరన్నరాత్రి ఉత్సవాలకు దుర్గామాత ఆలయం ముస్తాబయ్యింది.

బతుకమ్మ సంబురాలు ప్రారంభం

శివ్వంపేట మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

చిన్నశంకరంపేట మండలంలోని అంబాజిపేటలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

రామాయంపేట: మండల కేంద్రంలోని కేసీఆర్ కాలనీలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

రామాయంపేట/మనోహరాబాద్/చిన్నశంకరంపేట, అక్టోబర్ 2: జిల్లాలోని అన్ని గ్రామాల్లో పెత్తర అమావాస్య సందర్భంగా బతుకమ్మ సంబురాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తంగేడు, గునుగు పూలతో బతుకమ్మలు పేర్చి, గౌరమ్మ పాటలతో ఆట పాటలతో ఆడిపాడి, మహిళలు చెరువులో నిమజ్జనం చేశారు. మనోహరాబాద్ మండలంలో మాజీ జడ్పీ చైర్‌పర్సన్ ర్యాకల హేమలతాశేఖర్‌గౌడ్ నిర్వహించిన బతుకమ్మ సంబురా ల్లో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. లింగారెడ్డిపేటలో బీజేపీ గ్రామ అధ్యక్షుడు చాపల విజయ్ సొంత ఖర్చుతో రూ. 50 వేల విలువ చేసే వెయ్యి కోలలను ఆడపడుచులకు పంపిణీ చేశారు.

మనోహరాబాద్: బతుకమ్మ వేడుకల్లో మాజీ జడ్పీ చైర్ పర్సన్ ర్యాకల హేమలతాశేఖర్‌గౌడ్

మనోహరాబాద్: లింగారెడ్డిపేటలో కోలాటం కోలలు అందజేస్తున్న విజయ్ ముదిరాజ్

ఎమ్మెల్యే బేషరతుగా క్షమాపణ చెప్పాలి

ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చెట్లపల్లి యాదగిరి డిమాండ్

శివ్వంపేట, అక్టోబర్ 2: వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, మంద కృష్ణ మాదిగను విమర్శించడం సిగ్గుచేటని, బేషరతుగా క్షమాపణలు చెప్పాలని ఎమ్మార్పీఎస్ మెదక్ జిల్లా అధ్యక్షుడు చెట్లపల్లి యాదగిరి మాదిగ డిమాండ్ చేశారు. కుల మతాలకు అతీతంగా ప్రజలందరిని సమానంగా చూసుకుంటానని రాజ్యాంగం మీద ప్రమాణం చేసిన ఎమ్మెల్యే ఉద్యోగుల సమావేశంలో మాదిగలను కించపర్చి, మంద కృష్ణ మాదిగపై అహంకార పూరిత వాఖ్యలు చేయడంపై సరికాదన్నారు. ఎమ్మెల్యేపై కాంగ్రెస్ అధిష్టానం చర్యలు చేపట్టాలన్నారు.

స్వచ్ఛ గ్రామంగా తయారు చేయాలి

- ఈజీఎస్ పనులపై గ్రామసభ

రామాయంపేట/నిజాంపేట/చిన్నశంకరంపేట/మెదక్‌రూరల్, అక్టోబర్ 2: ఈజీఎస్ పనులపై అధికారులు గ్రామసభలు నిర్వహించారు. ఉపాధి హామీ పథకం 2025-26 సంవత్సరంలో గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనుల గుర్తింపు, ప్రణాళిక, సమస్యలపై గ్రామస్తులతో చర్చించారు. గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. తమ ఇంటి ముందున్న చెత్తాచెదారాన్ని వెంట వెంటనే తీసి వేయాలన్నారు. గ్రామాన్ని స్వచ్ఛంగా తయారు చేసుకోవాలని సూచించారు. అందరూ కలిసికట్టుగా ఉండి నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. నీటినిల్వల వల్ల దోమలు అధికమై సీజనల్ వ్యాధులకు గురయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. దోమలు మన దరికి చేరకుండా మన పరిసరాలను మనమే శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఉపాధి హామీ పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వచ్చే ఏడాది ఉపాధి హామీ ద్వారా చేపట్టబోయే పనులను గ్రామస్తులకు వివరించారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని తెలిపారు. అనంతరం స్థానికంగా ఏర్పాటు చేసిన బతుకమ్మ ఘాట్లను పరిశీలించారు.

కనీస వసతులు కల్పించరా?

మెదక్ మున్సిపాలిటీ, అక్టోబర్ 2: డీఎస్సీ-2024 ఉద్యోగాల భర్తీ కోసం సర్టిఫికెట్ల పరిశీలనకు వచ్చిన అభ్యర్థులు వసతుల్లేక ఇబ్బందులు పడ్డారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో సర్టిఫికెట్ల పరిశీలిన బుధవారం ప్రారంభమైంది. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలించినట్లు డీఈవో రాధాకిషన్ తెలిపారు. ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్లలో వివిధ కేటాగిరీల్లో ధ్రువ పత్రాల పరిశీలనకు 10 బృందాలను ఏర్పాటు చేశారు. ఈనెల 4వ తేదీ వరకు సర్టిఫికెట్ల పరిశీలన జరగనుంది. జిల్లాలో అన్ని కేటగిరీల్లో 310 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇందులో పీఈటీ 1 పోస్టు, ఎస్జీటీ 178, స్కూల్ అసిస్టెంట్లు 101, భాషా పండితులు 30 ఉన్నాయి. అభ్యర్థులంతా వసతుల్లేక ఇబ్బందులు పడ్డారు.

వసతులు కల్పించని అధికారులు..

సర్టిఫికేట్ల పరిశీలనకు వచ్చిన అభ్యర్థులకు విద్యాశాఖ కనీస వసతులు కల్పించలేకపోయింది. పరిశీలన కౌంటర్ల వద్ద ఎండలోనే నిల్చుని అవస్థలు పడ్డారు. కనీసం షామియానాలు ఏర్పాటు చేయక పోవడంతో అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారుల నుంచి జాబితా అందకపోవడంతో డీఎస్సీ ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో భాగంగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో అక్టోబర్1వ తేదిన (మంగళవారం) సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహించేందుకు జిల్లా విద్యాశాఖ సరైన ఏర్పాట్లు చేయలేకపోయింది. అభ్యర్థులు నిర్దేశించిన సమయానికి చేరుకున్నా ఉన్నతాధికారుల నుంచి జాబితా అందక పోవడంతో పరిశీలన జరుగలేదు. సాయంత్రం 5 గంటల వరకు వేచి చూసిన అభ్యర్థులు నిరుత్సాహంతో వెనుదిరిగారు.

వసతులు కల్పించకపోవడంతో ఎండలో ఇబ్బందులు పడుతున్న అభ్యర్థులు

బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే ఆర్థిక సాయం

మాజీ సర్పంచ్ సుంకరి సర్సింలు, గ్రామ అధ్యక్షుడు సత్యనారాయణగౌడ్, నాయకులు ఇక్బాల్, ముష్టి గంగయ్య, దుర్గయ్య, బాలరాజ్, మహేశ్, వెంకటస్వామి ఉన్నారు.

మెదక్‌రూరల్, అక్టోబర్ 2: మెదక్ మండల పరిధిలోని మక్త భూపతిపూర్ గ్రామానికి చెందిన కర్రోళ మల్లేశం ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి బుధవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆర్థిక సాయం అందజేశారు. వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆమె వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అంజాగౌడ్,

బగలాముఖి శక్తిపీఠంలో హరిద్రార్చన

అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

శివ్వంపేట, అక్టోబర్ 2: శివ్వంపేట లోని బగలాముఖి శక్తిపీఠంలో బుధవారం అమావా స్య సందర్భంగా బగలాముఖీ ట్రస్ట్ చైర్మన్ బ్రహ్మశ్రీ శాస్త్రుల వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. హరిద్రార్చన, అభిషేకం, బగలాముఖి అష్టోత్తర శతనామార్చన, మంత్ర పుష్పం పూజలు చేశారు. శక్తిపీఠం ప్రాంగణంలో అమ్మవారికి బగలాము ఖీ మహామంత్రహవనం నిర్వహించారు. భక్తుల జయ, జయ ధ్వనులతో శక్తిపీఠం పరిసరాలన్నీ మార్మోగాయి. పబ్బ రమేశ్‌గుప్తా, మాజీ జడ్పీటీసీ పబ్బమహేశ్‌గుప్తాల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

7న మెదక్‌లో బతుకమ్మ ఉత్సవాలు

మెదక్ మున్సిపాలిటీ, అక్టోబర్ 2: మెదక్‌లోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో ఈనెల 7న మైనంపల్లి సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ (ఎమ్ఎస్ఎస్‌వో) ఆధ్వర్యంలో బతుకమ్మ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే రోహిత్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉత్సవంలో ఎమ్ఎస్ఎస్‌వో ఆధ్వర్యంలో నియోజకవర్గంలో పది వేల మంది ఆడపడుచులకు పట్టు చీరలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఆడపడుచులు ఉత్సవాల్లో పాల్గొనాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

రామాయంపేట, అక్టోబర్ 2: అర్హులైన ప్రతిఒక్కరికీ సీఎంఆర్ఎఫ్ చెక్కులను ప్రభుత్వం అందిస్తున్నదనిమాజీ ఎంపీపీ రమేశ్‌రెడ్డి, పీసీసీ కార్యదర్శి సుప్రభాతరావు అన్నారు. బుధవారం పట్టణంలోని రామాయంపేట, నిజాంపేట మండలాలకు చెందిన 19 మందికి రూ.6 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. వారితో అల్లాడి వెంకటేశ్, చింతల స్వామి, చిలుక స్వామి, బైరం కుమార్, వినయ్‌సాగర్, శంకర్, ఉడుత రాజయ్య, విప్లవ్ ఉన్నారు.

బహిరంగంగా మటన్, కల్లు విక్రయాలు

మటన్ షాపు నుంచి మాంసాన్ని స్వాధీన చేసుకుంటున్న మున్సిపల్ సిబ్బంది

- దాడులు నిర్వహించిన మున్సిపల్ అధికారులు
- మాంసం స్వాధీనం, జరిమానా విధింపు
- నిజాంపేటలో కల్లు విక్రయం

మెదక్ మున్సిపాలిటీ, అక్టోబర్ 2: గాంధీ జయంతి రోజు నిబంధనలకు విరుద్ధంగా మటన్ దుకాణాలపై మున్సిపల్ హెల్త్ ఇన్స్పెక్టర్ మహేశ్ ఆధ్వర్యంలో బుధవారం దాడులు నిర్వహించారు. ఆటోనగర్‌లోని మటన్ షాపుల నుంచి సుమారు 40 కిలోల మటన్‌ను స్వాధీన పరుచుకుని, జరిమానాలు విధించారు. మటన్‌ను డంప్‌యార్డుకు తరలించి పారబోశారు. ఒక హోటల్‌లో అక్రమంగా వధిస్తున్న కోళ్లను పట్టుకుని హోటల్‌కు యజమానికి జరిమానా విధించినట్లు మహేశ్ తెలిపారు. గాంధీ జయంతి రోజున మటన్, చికెన్ అమ్మకాలు జరుపరాదని నిర్వాహకులకు ఒక రోజు ముందే తెలిపినాన బహిరంగంగా విక్రయిస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కావద్దని హెచ్చరించారు. ఆయన వెంట మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

నిజాంపేటలో..

నిజాంపేటలో..

నిజాంపేట, అక్టోబర్2: గాంధీ జయంతి రోజు నిబంధనలకు విరుద్ధంగా మండలంలోని నగరంలో కల్లు విక్రయాలు కొనసాగాయి. నస్కల్ కల్లు డిపో నుంచి సరఫరా అయిన కల్లును యధేచ్ఛగా నగరం గ్రామంలో విక్రయించారు. కల్లు సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్‌పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని గాంధేయవాదులు కోరుతున్నారు.